

జగనన్న సురక్షను వినియోగించుకోవాలి : కలెక్టర్

భీమవరం : జిల్లా వ్యాప్తంగా రెండో విడత చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని ఈనెల రెండు నుంచి ఆరు నెలల పాటు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి మండలంలో వారానికో క్యాంపు జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాల్లో, పట్టణ ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో జరుగుతుందని తెలిపారు. ఈ క్యాంపులో నలుగురు వైద్యుల బృందం ఉంటుందని, దీనిలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు కూడా ఉంటారని తెలిపారు. వెల్నెస్ కేంద్రాల్లో జరిగే ఈ క్యాంపుల కోసం రిజిస్ట్రేషన్ కౌంటర్, హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 92 రకాల మందులు, పట్టణ ప్రాంతాల్లో 187 రకాల మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో 14 రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


ఎంపీ అభ్యర్థులు కావలెను..!

- పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువు
- రెండు ఎంపీ స్థానాల్లోనూ టిడిపి, వైసిపికి అదే పరిస్థితి
- ఎటువంటి అధికారాలూ ఉండటం లేదని పోటీకి విముఖత
- ఎంఎల్ఎగా పోటీ చేసేందుకే అంతా మొగ్గు
- బలవంతంగా ఒప్పించే ప్రయత్నంలో అధిష్టానాలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికీ ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపికి పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై స్పష్టత లేకుండాపోయింది. కనీసం ఆశావహుల పేర్లు కూడా విన్పించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఎంపీ స్థానాలకు పోటీ చేసేందుకు అభ్యర్థులు ఎవరూ ముందుకు రాకపోవడమేనని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతో ఆర్థికంగా బలంగా ఉన్న కొత్తవారి కోసం పార్టీలు వెదుకులాడుతున్నాయి. రెండు జిల్లాల పరిధిలో రెండు పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలు ఏలూరు, నరసాపురం ఉన్నాయి. 2019 ఎన్నికల్లో ఈ రెండు స్థానాలను వైసిపి గెలుచుకుంది. నరసాపురం నుంచి కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏలూరు నుంచి కోటగిరి శ్రీధర్ గెలిచారు. గెలిచిన కొద్దికాలానికే నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు, వైసిపికి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఎంపీ రఘురామకృష్ణంరాజు అప్పటి నుంచి జిల్లాకు దూరంగా ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయబోనని కోటగిరి శ్రీధర్ తేల్చేసినట్లు చెబుతున్నారు. ఎంఎల్ఎగా అవకాశం ఇస్తే పోటీ చేస్తానని శ్రీధర్ అన్నట్లు తెలుస్తోంది. నరసాపురం స్థానంలోనూ కొత్త అభ్యర్థిని వైసిపి నిలబెట్టాల్సి ఉంది. ఎంపీగా పోటీ చేయాలంటే కనీసంగా రూ.50 నుంచి రూ.75 కోట్లు వరకూ ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. దాదాపు ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇంత ఖర్చు పెట్టి గెలిచినా తమకు ఎటువంటి గుర్తింపూ ఉండటం లేదని ఎంపీలుగా గెలిచిన వారు చెబుతున్నారు. దీంతో కొత్తవారు ఎంపీగా పోటీ చేసేందుకు సైతం ముందుకు రావడం లేదు. అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎల్ఎలే పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్నారు. తాము కనీసం ఒక్క అధికారికి కూడా పోస్టింగ్ వేయించలేకపోతున్నామని ఎంపీలు బాధపడుతున్నారు. ఏలూరు ఎంపీ శ్రీధర్‌కు, చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజాకు మధ్య గడిచిన నాలుగున్నరేళ్లుగా ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి ఉన్నప్పటికీ బయటపడని పరిస్థితి ఉంది. దీంతో ఇక ఎంపీగా పోటీ చేయకూడదని శ్రీధర్ నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఎంఎల్ఎలుగా ఉన్నవారినే ఒకరిని ఎంపీగా పోటీ చేయించాలని వైసిపి చూస్తున్నప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. నరసాపురం పార్లమెంట్ స్థానంలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో వైసిపి అధిష్టానానికి ఎంపీ అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారిందని చెబుతున్నారు. బడా వ్యాపారులను వెదికి పట్టుకుని రంగంలోకి దించుతారనే ప్రచారం సాగుతోంది. ఇక మరో ప్రధాన పార్టీ టిడిపి విషయంలోనే ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఆ పార్టీకి సైతం ఎంపీ అభ్యర్థులపై ఇప్పటికీ స్పష్టత లేకుండాపోయింది. ఎంఎల్ఎ అభ్యర్థులకు సంబంధించి కొంతమేర స్పష్టత ఉన్నప్పటికీ ఎంపీ అభ్యర్థులకు సంబంధించి మాత్రం ఉలుకుపలుకు లేకుండాపోయింది. 2019లోనూ నరసాపురం ఎంపీ అభ్యర్థిగా ఎవరూ దొరకకపోవడంతో చివరి నిముషంలో ఉండి ఎంఎల్ఎగా ఉన్న వేటుకూరి శివరామరాజును ఎంపీగా రంగంలోకి దించారు. ఆ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. ఈసారి ఆయన ఎంపీగా పోటీ చేసే అవకాశం లేదని స్పష్టమైంది. పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం జనసేనకు ఇస్తారనే ప్రచారం సైతం ఉంది. అదే జరిగితే గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీచేసి ఓడిపోయిన నాగబాబును మళ్లీ బరిలోకి దించుతారా అని అంచనాలు వేస్తున్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక ఎంపీ నిధులు తగ్గిపోవడంతోపాటు నియోజకవర్గాల్లో ఎంఎల్ఎలు ఎంపీలను పట్టించుకోకపోవడం వంటి అనేక కారణాలతో పార్లమెంట్ స్థానాలకు పోటీచేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో ఎంపీ అభ్యర్థులు కావలెను అనే తరహాలో ప్రధాన పార్టీలు తమ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏలూరు, నరసాపురం పార్లమెంట్ స్థానాలకు ఇరుపార్టీల నుంచి ఎంపీ అభ్యర్థులుగా ఎవరు నిలబడతారో వేచిచూడాలి.



పెదఅమిరంలో లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఇక నుంచి పింఛను రూ.3 వేలు

కొత్తగా జిల్లాకు 4,274 పింఛన్లు మంజూరు - జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - కాళ్ల

సామాజిక భద్రత కింద అందజేస్తున్న వైఎస్ఆర్ పింఛను కానుక ఈ నెల ఒకటో తేదీ నుంచి మరో రూ.250 పెంచడం ద్వారా రూ.3 వేలు అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కాళ్ల మండలం పెదఅమిరం ఇందుకూరి వెంకట సుబ్బరాజు, సుబ్బమ్మ కళ్యాణ వేదిక వద్ద ఏర్పాటుచేసిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అవ్వా, తాతలు, వితంతు, ఒంటరి మహిళలు, తదితర పింఛనుదారుల స్థితిగతులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ఇప్పటివరకూ అందజేస్తున్న రూ.2,750లకు మరో రూ.250 జోడించి నేటి నుండి రూ.3,000 అందజేయనున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల ఆర్థిక స్థితిగతులను మార్చేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాన్ని ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ ఆయా మండలాలు, మున్సిపాల్టీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 2,36,928 మందికి వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్ జెండర్లు, మత్స్యకారులు, ఒంటరి మహిళలకు పింఛను రూ.2,750 నుంచి రూ.3,000లకు ప్రభుత్వం పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసులు రాజు, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌విఎస్.ప్రసాద యాదవ్, తహశీల్దారు, టిఎ.కృష్ణారావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎంఎస్.భాస్కరరావు, డిపిఎంలు కె.శ్రీనివాస్, డి.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు మరిన్ని సేవలందించాలి : కలెక్టర్



కేక్‌కట్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి


కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

అధికారులు జిల్లా ప్రజలకు మంచి సేవలందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, కుమార్తె సిరి చందన, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఆయన సతీమణి ప్రసన్నతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్, జెసి రామ్‌సుందర్ రెడ్డి దంపతులు, డిఆర్‌ఒ ఎం.శివన్నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి వైకెవి.అప్పారావు, సిబ్బంది, జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పెద్దఎత్తున ప్రజలు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు, పండ్లు, బొకేలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు కష్టపడి పనిచేసి లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరింత కష్టపడి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల నిర్వహణలో జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం 2024 రెవెన్యూ అసోసియేషన్ డైరీని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్య, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాథుర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

తణుకు : తణుకులో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నివాసం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తారా... ఉరేసుకోమంటారా..!



తణుకులో మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

6లో..

నేటి నుంచి మంత్రి కారుమూరి ప్రజాదీవెన పాదయాత్ర

ప్రజాశక్తి - తణుకు

తణుకు నియోజకవర్గంలో ఈ నెల రెండో తేదీ మంగళవారం నుంచి ప్రజాదీవెన పాదయాత్ర చేపడుతున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజవర్గంలోని అత్తిలి నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నాని, పాదయాత్ర ముగింపు సమయంలో ఆ గ్రామంలో బసచేసి స్థానిక సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తానని తెలిపారు. అత్తిలి మండలంలోని కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, ఆరవల్లి, ఉనికిలి గ్రామాల్లో పదో తేదీ వరకూ పాదయాత్ర జరుగుతుందన్నారు. తిరిగి మరలా సంక్రాంతి తర్వాత పాదయాత్ర కొనసాగుతుందన్నారు. గడపగడపకూ చేపట్టని గ్రామాల్లో ముందుగా పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డిది అన్నారు. ఆర్అండ్‌బి రోడ్లు పూర్తిస్థాయిలో వేయడం జరుగుతుందని, టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే మూడు వేల కోట్లతో సంక్షేమం అభివృద్ధి జరిగిందన్నారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు మంగెని సూర్య పాల్గొన్నారు.

9 నుంచి ఆకివీడులో సంక్రాంతి యువజనోత్సవాలు


డివైఎఫ్ఐ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆకివీడు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 41వ సంక్రాంతి యువజనోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ జరుగుతాయని యువజనోత్సవాల కన్వీనర్ డోకల రవితేజ తెలిపారు. సోమవారం ఆయన సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. యువజనోత్సవాల్లో ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళా ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిలో భాగంగా రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు, బాడీ బిల్డింగ్, జిల్లాస్థాయిలో వాలీబాల్, చెస్, పాటలు, డాన్స్ పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు జరుగుతాయన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, జూదం వంటి దుర అలవాట్లకు యువతను దూరంగా ఉంచాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యువతీ యువకులకు విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలనే నినాదంతో డివైఎఫ్ఐ పనిచేస్తోందన్నారు. యువతీ యువకులను కాపాడి ప్రభుత్వం ఇప్పటికైనా జూదాన్ని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయి ఆపై స్థాయిలో ఉన్నటువంటి క్రీడాకారులు సైతం పాల్గొంటున్నారని, రసవత్తరంగా సాగే ఈ పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నిర్వహణ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, గేదెల రాము, బత్తిలి అప్పారావు, బి.వర్మ, ఆర్జీ సతీష్, లింగాల బలరాం పాల్గొన్నారు.



మొగల్తూరులో వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



పాలకోడేరులో..



గణపవరంలో..



అత్తిలిలో..

మీ అబ్బాయికి కలలోనైనా చెప్పండి

వైఎస్ఆర్ విగ్రహాలకు అంగన్‌వాడీల వినతులు

21వ రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె స్ఫూర్తితో అనేక ఉద్యమాలు ముందుకు వస్తున్నాయని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, పిఎస్.విజయరామరాజు తెలిపారు. సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో 21వ రోజు సమ్మె కొనసాగింది. శిబిరం వద్ద రామభద్రం, విజయరామరాజు మాట్లాడారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.మీ అబ్బాయి జగన్ నిద్రపోతున్నట్టు నటిస్తున్నాడు కలలోనైనా చెప్పండి అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కళ్యాణి, విజయలక్ష్మి, యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభి, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరవాసరం: తమ సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని తుడిచేయడం ఖాయమని అంగన్‌వాడీలు నినదించారు. సోమవారం సమ్మె 21వ రోజుకు చేరిన నేపథ్యంలో చీపురు పట్టి రోడ్లు ఊడుస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.అశ్రియ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, అంగన్‌వాడీ నాయకులు పి.నాగరత్నం, సత్యవతి, శాంతికుమారి, నాగ పార్వతి, వెంకటలక్ష్మి నాయకత్వం వహించారు.



పెనుమంట్రలో..

కాళ్ల : 21 రోజుల నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టనట్టు వ్యవహరించడం దారుణమని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ విగ్రహం వరకూ ప్రదర్శన నిర్వహించి వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి మండా సూరిబాబు, యడవల్లి చంద్రావతి, ఝాన్సీరాణి, దవులూరి మార్తమ్మ పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. ఈ మేరకు పెనుమంట్ర మార్కెట్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం ఆటపాటలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో మార్టేరు, పెనుమంట్ర, ఆలమూరు సెక్టార్ నాయకులు సాయి మహాలక్ష్మి, మౌనిక పాల్గొన్నారు.

పోడూరు : అంగన్‌వాడీలు సోమవారం 21వ రోజు దీక్షా శిబిరం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కవిటంలోని వైఎస్ఆర్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకట్రావు, జె.ఉమాదేవి పాల్గొన్నారు.

ఆచంట : ఆచంట కచేరీ సెంటర్లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద గంటసేపు ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి వర్ధిపర్తి అంజిబాబు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు మైలే విజయలక్ష్మి, మహేశ్వరి, జి.కమల, పద్మ, సత్యవతి పాల్గొన్నారు.

పాలకొల్లు : అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లోని వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైఎస్ఆర్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కామన మునిస్వామి, అంగన్‌వాడీ కార్మికులు వసంతకుమారి, ప్రమీల, దుర్గాదేవి, ఎం.రోజా పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. స్థానిక స్టీమర్ రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకుని మీ అబ్బాయి జగన్మోహన్ రెడ్డి కల్లోకి వెళ్లి మా సమస్యలు పరిష్కరించాలని చెప్పాలని అంగన్‌వాడీలు విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్‌వాడీ నాయకులు ఎ.నీలిమ, జి.శ్రీలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గణపవరం : 21వ రోజు అంగన్‌వాడీలు వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాటుక ఝాన్సీలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి ఎమ్‌డి హసీనాబేగం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బి.రామకోటి, ధనలక్ష్మి, కళ్యాణి, కెవి.మహాలక్ష్మి పాల్గొన్నారు.


ఉండి : వైఎస్ఆర్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు చైతన్య, కుసుమ, సత్యవేణి, ఝాన్సీ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీలు రోడ్లపైకొచ్చి రోజుల తరబడి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. అంగన్‌వాడీల దీక్షలు 21వ రోజు కొనసాగాయి. జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు మార్చాలని కోరుతూ తండ్రి వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు. పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు.

పెనుగొండ : జగన్‌కు జ్ఞానోదయం అయ్యేలా మీరే కలలో చెప్పాలని వైఎస్ఆర్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ముందుగా ప్రదర్శనగా అంగన్వాడీల శిబిరం నుంచి పెనుగొండ మెయిన్ రోడ్డు గుండా కాలేజీ సెంటర్లోని వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలతో పాటు సిఐటియు నాయకులు మాదాసు నాగేశ్వరరావు, గంగారావు, ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకోడేరు : అంగన్‌వాడీల సమ్మె 21వ రోజు కొనసాగింది. స్థానిక సచివాలయం వద్ద ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి అంగన్వాడీలు వినతిపత్రం అందజేసి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు విమల, విజయలక్ష్మి, విమల కుమారి పాల్గొన్నారు.

అత్తిలి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరం నుంచి ర్యాలీ వెళ్లి వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సమ్మెకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, జిల్లా కార్యదర్శి రాణి, సిఐటియు నాయకులు ధర్మేంద్ర మద్దతు తెలిపారు.




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

'ప్రజాశక్తి'ని అంతా ప్రోత్సహించాలి

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

ప్రజాశక్తి పత్రికను అందరూ ప్రోత్సహించాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ప్రజాశక్తి 2024 క్యాలెండర్ ఎంతో ఆహ్లాదకరంగా, చూడముచ్చటగా ఉందని ఆయన అన్నారు. ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ఈ నూతన సంవత్సరంలో మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ స్థాయిలో అనేక యూట్యూబ్, టీవీ ఛానళ్లు, వివిధ రకాల కార్పొరేట్ దిన పత్రికలను తట్టుకుంటూ ప్రజాశక్తి దినపత్రిక ఎటువంటి లాభాపేక్ష లేకుండా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళుతుందన్నారు. ఇటువంటి పత్రికను అందరూ ప్రోత్స హించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, పెనుమంచిలి సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు, వైసిపి నాయకురాలు మామిడిశెట్టి కృష్ణవేణి, మార్టేరు నెగ్గపూడి ఎంపి టిసి సభ్యులు కర్రి అనురాధ, పెనుగొండ లక్ష్మి, ప్రజాశక్తి నరసాపురం డివిజన్ ఇన్ ఛార్జి కటకంశెట్టి బాలాజీనాయుడు, ఆచంట విలేకరి పి.మోహన్‌రావు పాల్గొన్నారు.




డిఇఒకు మొక్క అందిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి

డిఇఒకు మొక్క అందించిన ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్


తమ ఆవేదనను అర్థం చేసుకుని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు డిఇఒ వెంకటరమణకు సోమవారం మొక్కను అందించి కోరారు. పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, అధికారులు కలిసి మద్దతు కోరారు. అనంతరం డిఇఒ వెంకటరమణకు మొక్కను అందించి వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌టియు, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించారు. అనంతరం సమ్మె శిబిరం వద్దే నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బాలాజీ, వాసు, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.



నవల ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకటశివరామరాజు

'మది మెచ్చిన మన్మధుడు' ఆవిష్కరణ

ఉండి : మది మెచ్చిన మన్మధుడు నవల పుస్తకాన్ని టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎంఎల్ఎ, శివ స్వచ్ఛంద సేవా సంస్థల అధినేత వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ఆవిష్కరించారు. భీమవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం మాజీ సర్పంచి ప్రియదర్శిని విజయరత్నం కుమారుడు కార్తికేయ రాసిన మది మెచ్చిన మన్మధుడు నవలను శివరామరాజు ఆవిష్కరించారు. తొలి పుస్తకాన్ని ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత కార్తికేయ నేటి మానవ సంబంధాలు జీవనశైలి వ్యవహార శైలిపై చక్కగా ఈ నవల రాశారన్నారు. ప్రతిఒక్కరూ ఈ నవలను చదవాలన్నారు. చిన్న వయసులోనే ఎంతో పరిజ్ఞానంతో రచయిత కార్తికేయ తన ప్రతిభను చూపించారన్నారు. ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ పుస్తకాలను చదవాలని, వాటిపై అవగాహన పెంచుకుని, సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో రచయిత తాళ్లూరి కార్తికేయ, తాళ్లూరి విజయరత్నం, నడింపల్లి సత్యనారాయణరాజు(సత్తిబాబు), మోపిదేవి శ్రీనివాస్, వత్సవాయ సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న శ్రీను

పర్రిపాటి శ్రీనుకు రాష్ట్ర పదవి

భీమవరం రూరల్ : భీమవరానికి చెందిన పర్రిపాటి బిబిఎస్ఎన్.గుప్త (పర్రిపాటి శ్రీను) వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ భూవివాదాలు, పర్యావరణ పరిరక్షణ విభాగం ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన ఆర్యవైశ్య సంఘం భీమవరం మండలాధ్యక్షునిగా, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాసవి క్లబ్ రీజియన్ సెక్రటరీగా, ద్వారకాతిరుమల శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపం ట్రస్ట్ సభ్యునిగా సేవలందిస్తున్నారు. కరోనా కష్టకాలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఆయనలోని సేవా నిరతిని గుర్తించిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ ఛైర్మన్ రావూరి బాలరాజు, నేషనల్ కమిటీ ఛైర్మన్ ఎస్.సుధాకర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ఛైర్మన్ ఎ.గణేష్‌నాయక్ ఈ పదవిలో నియమించారు. తనను ఈ పదవిలో నియమించిన వారికి పర్రిపాటి శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. మరింత మెరుగైన సేవలందిస్తానని ఆయన తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ఉండి : పేకాటస్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... ఉండి నిమ్మలపేటలో రైల్వే గేటు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఉండి పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,290 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఉఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సమస్యలు పరిష్కరిస్తారా... ఉరేసుకోమంటారా..!

7వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె



భీమవరం రూరల్ : సమ్మె శిబిరం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

సమస్యలు పరిష్కరిస్తారా లేదంటే ఉరేసుకోమంటారా అని మున్సిపల్ కార్మికులు అన్నారు. మున్సిపల్ కార్మికులు సోమవారం ఏడో రోజు మెడలకు ఉరితాడు తగిలించుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ కనీస వేతనం అడిగితే ప్రభుత్వం నేరంగా భావిస్తుందన్నారు. పోటీ కార్మికులను తీసుకొచ్చి బలవంతంగా వారితో పనులు చేయించడానికి అధికారులు ప్రోత్సహిస్తున్నారని, ఇది చట్ట వ్యతిరేకమని చెప్పారు. సమస్యలు పరి ష్కరించేందుకు సిఎం జగన్ చొరవ తీసుకోవాలని, లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని చెప్పారు. ఇప్పటికే పట్టణంలో చెత్త పేరుకుపోయి ప్రజలకు అనారోగ్యాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా కని పిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నా యకులు కామన మునిస్వామి, కాం ట్రాక్ట్ కార్మికులు నీలాపు ఆది నారాయణ, కృష్ణబాబు, సింహాద్రి, సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని మున్సి పల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో ఏడో రోజుకు చేరుకుంది. భీ మవరం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. సమ్మెకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికుల సేవలను వెలకట్టలేమని ప్రకటించిన సిఎం జగన్ తను అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలంటే మున్సిపల్ కార్మికుల సేవ చాలా కీలకమని, సమాజంలో ఆ పని ఎవరూ చేయలేరని, కాని ప్రభుత్వం వారిని గుర్తించడంలేదని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అడుగుతుంటే పెంచడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులతో చర్చించి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే వాళ్ల సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటామని హెచ్చ రించారు. ఈ ధర్నాలో సిఐటియు, ఎఐసిటియు నాయకులు బి.వాసుదేవరావు, జి.నాని, ఎం.రాజు, ధనలక్ష్మి, బంగారు మరియమ్మ, పద్మ, వరలక్ష్మి, ఎన్.విశ్వనాథం, నేలపు అప్పన్న, ఆకుల సత్యనారాయణ, నేలపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ నిరసనను ఉద్దేశించి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తుంటే



తాడేపల్లిగూడెం : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరించకపోగా సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నించడం దారుణమన్నారు. మార్కెట్‌లో పెరుగుతున ధరలకు అనుకూలంగా జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.సతీష్, ధనాల్‌రాజు, నీలాపు ధనరాజు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. స్థానిక ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గత నెల 29న భీమవరంలో జరిగిన సిఎం జగన్ పర్యటనలో గ్రంధి శ్రీనివాస్‌కు స్వయంగా సిఎం జగన్ సీటు ఖరారు చేస్తు సంకేతాలు ఇవ్వడంతో ఈ వేడుకలకు మరింతగా జన సందోహం పెరిగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు.

జగన్‌ను కలిసిన తోట సీతారామలక్ష్మి

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, వారి కుమార్తె నీలోఫర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును హైదరాబాదులోని వారి నివాసంలో సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి జిల్లాలోని తాజా రాజకీయ విషయాలను చంద్రబాబుకు వివరించారు. చంద్రబాబు మాట్లాడుతూ 2024లో పార్టీ శ్రేణులంతా అంకితభావంతో పని చేస్తూ అలుపెరగని పోరాట ప్రయత్నాలతో కొత్త శిఖరాలను చేరుకుంటూ కొత్త సవాళ్లను ఎదుర్కొంటూ అద్భుతమైన విజయాలను అందుకోవాలన్నారు.

ఆచంట : నూతన సంవత్సరం సందర్భంగా ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా కొడమంచిలి గ్రామం నుంచి సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ ఆయన నాయకత్వంలో మరోసారి ఆచంటలో విజయం సాధించడం ఖాయమన్నారు.

ముగ్గుల పోటీలు

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కొల్లేపర వెంకన్నబాబు అన్నారు. ఆచంటలో సోమవారం నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని కొల్లిపర రామారావు, ఆయన కుమారుడు వెంకన్నబాబు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్‌విఎస్.రామచంద్రకుమార్, విశ్రాంతి వ్యవసాయ విస్తరణ అధికారి, కుక్కల సత్యనారాయణ, పద్మ, దేవస్థానం మాజీ ఛైర్మన్ వేమన అప్పారావు, గొడవర్తి పద్మ, లత, సత్యవతి, సూర్యకుమారి, మంగాదేవి, రత్నకుమారి పాల్గొన్నారు.

ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును పోడూరు మండలం తూర్పుపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజవర్గ ప్రజలు, వివిధ



కాళ్ల : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంఎల్ఎ శివరామరాజు

శాఖల అధికారులు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాళ్ల : నియోజకవర్గ ప్రజలందరికీ శ్రేయస్సు, శాంతి, ఆరోగ్యం చేకూరాలని ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ అభివృద్ధి కోసం టిడిపికి పట్టం కట్టాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, మోపిదేవి నాగ శ్రీనివాస్, ముదుండి దుర్గరాజు, తెలుగు మహిళలు ముదుండి ఉషాకుమారి, వేగేశ్న అనంతలక్ష్మి, బుద్ధరాజు పద్మావతి, కన్నెగంటి రూత్‌కళ, బచ్చు సరళ, బొర్రా సుజాత, పెద్ద ఎత్తున టిడిపి, జనసేన, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెదఅమిరంలో..

పెదఅమిరం గ్రామంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజుకు పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండల అధికారులకు, వివిధ గ్రామాల సర్పంచులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రముఖ నాయకులకు, పెద్ద ఎత్తున ఆయా పార్టీల శ్రేణులు, అభిమానులు పలువురు హాజరై స్వీట్లు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయాల వద్ద న్యూ ఇయర్ కేకును కట్ చేశారు.

కిటకిటలాడిన చర్చిలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, యువతీ యువకులు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఏలూరుపాడులో ఇహెచ్‌హెచ్, ఏసుక్రీస్తు ప్రార్ధన మందిరంలో, సిఎస్ఐ, ఆర్‌సిఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పెదఅమిరం గ్రామంలో సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో, కాళ్ల గ్రామంలో లూథరన్, బేతేలు, ఏసుక్రీస్తు ప్రార్ధన మందిరాల్లో ప్రార్ధనలు నిర్వహించారు. బల్లారాధన, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. చర్చిలు ప్రజలతో కిటకిటలాడాయి. విశ్వాసులకు పాస్టర్లు ఆశీర్వచనాలు అందించారు.

వీరవాసరం : ఈ నూతన సంవత్సరంలోనైనా బేషజాలు పక్కన పెట్టి మండలాభివృద్ధిని ముందుకు తీసుకెళ్దామని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. మండలంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఉపాధ్యాయుల, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల ఇళ్లకు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మండలంలో ఆయా గ్రామాల సర్పంచులు ఇళ్ల వద్ద, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పోలిశెట్టి సత్యనారాయణ(దాసు) ఇంటి వద్ద సందడి నెలకొంది. వీరవాసరం మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, టిడిపి నాయకులు మళ్ల శ్రీరామూర్తి, పంజా వెంకటేశ్వరరావు వేడుకల్లో పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో నూతన సంవత్సరం సందర్భంగా పలువురు ప్రముఖుల ఇళ్ల వద్ద సందడి నెలకొంది. వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ కార్యాలయం వద్ద, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు గృహాల వద్దకు అభిమానులు, అధికారులు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడంతో సందడి నెలకొంది. పాలకొల్లు ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, వైసిపి నేతలు అడబాల వెంకటరమణ, కర్ర జయసరిత, పెచ్చెట్టి కృష్ణాజీ, మామిడి వెంకటేశ్వరరావు, పవన్, మున్సిపల్ టిపిఒ వీరబ్రహ్మం, టిపిఎస్ త్రినాధరావు ఉన్నారు. వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపీ సిఎం జగన్ వద్దకు ఉదయం వెళ్లడంతో సాయంత్రం నుంచి అందుబాటులో ఉన్నారు. టిటిడి సభ్యులు మేకా శేషుబాబు తిరుమల వెళ్లారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ వేడుకలకు దూరంగా ఉన్నారు.

నరసాపురం టౌన్ : జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఉండి : నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు. ఉండి నియోజకవర్గంలోని టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ రామరాజు, శివ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకటశివరామరాజు, వైసిపి కార్యాలయంలో డిసిసిబి ఛైర్మన్, నియోజకవర్గ కన్వీనర్ పివిఎల్.నరసింహరాజు, నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు కార్యాలయం వద్ద, జనసేన ఉండి నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు కార్యాలయాల వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు ప్రతినిధులు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భీమవరం : జెసి క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులు, ఉద్యోగుల సమక్షంలో జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి భారీ కేక్‌ను కట్ చేశారు. జిల్లా అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రతినిధులు, చిరుద్యోగులు జెసిని కలిసి పూలబొకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుతఅంబరీష్, కె.చెన్నయ్య, జిల్లా, మండల వివిధ శాఖల అధికారులు, చిరుద్యోగులు, జిల్లా రైస్ మిల్లర్స్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఏరియేటర్లకు అక్రమ విద్యుత్..!

లైన్‌మెన్ల చేతివాటం
చోద్యం చూస్తున్న విద్యుత్ శాఖాధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

ఒకవైపు అనుమతులు లేకుండా ఆక్వా చెరువులకు విద్యుత్ వినియోగిస్తూ.. మరోవైపు అక్రమ విద్యుత్ వాడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడం ఆశ్చర్యంగా ఉందని రైతులు విమర్శిస్తున్నారు. నిబంధనల మేరకు అనుమతి తీసుకున్న ఆక్వా చెరువుకు మాత్రమే విద్యుత్ వినియోగించాలి. ఆక్వా చెరువు యజమానులతో విద్యుత్ శాఖ లైన్‌మెన్లు చేతులు కలిపి విద్యుత్ వాడకంలో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. కొంతమంది రైతులే చిన్న చెరువుల రైతులకు ఒక్కరోజుకు ఒక ఏరియేటర్‌కు రూ.300 నుంచి రూ.350 వరకు వసూలు చేస్తున్నారు. అధికారులు మాత్రం అటువంటి విద్యుత్ వాడకం లేవని చెప్పడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ద్వారా విద్యుత్ సరఫరా ఆక్వా చెరువులకు జరుగుతుంది. మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ లైన్‌మెన్లు ఆక్వా సాగులో రొయ్యల చెరువుల వద్ద అక్రమ విద్యుత్ వాడకంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో విద్యుత్ శాఖకు రావాల్సిన ఆదాయానికి లైన్‌మెన్లు గండి కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్వా సాగులో చేపలు, రొయ్యలు సాగు చేయడానికి కెపాసిటీ సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని నిబంధన లేదు. ప్రస్తుతం చేపలు, రొయ్యల చెరువులు



ఆక్వా చెరువుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సాగు చేసేందుకు మత్స్యశాఖ అనుమతి తీసుకోవాలి. మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ లైన్‌మెన్ల అండదండలతో యథేచ్ఛగా అక్రమ విద్యుత్ వాడకం జరుగుతోంది. 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ఆక్వా చెరువు నుంచి మరో ఆక్వా చెరువుకు ఏరియేటర్లు తిప్పడానికి కొంతమంది రైతులే చిన్న చెరువుల రైతులకు ఒక ఏరియేటర్‌కు రూ.300 నుంచి రూ.350 వరకు ఒక్క రోజుకు వసూలు చేస్తున్నారు. కొంతమంది విద్యుత్ లైన్‌మెన్లు ఒక చెరువుకు వచ్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫారం నుంచి మరో చెరువుకు విద్యుత్ సరఫరా ఇవ్వడం పరిపాటిగా మారింది. లైన్‌మెన్లు పెద్దఎత్తున అక్రమ విద్యుత్తు వాడకానికి సహకారం అందిస్తూ ప్రభుత్వానికి గండి కొడుతున్నారు.

కాళ్ల మండలంలో 250 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, 160 కెవి 50, 100 కెవి 340 ఉన్నాయి. 63 కెవి 487, 50 కెవి రెండు, 40 కెవి 795 ఉన్నాయి. 25 కెవి 183, 16 కెవి 79 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మొత్తం డిటిఆర్ఎస్ ట్రాన్స్‌ఫార్మర్లు 2217 ఉన్నాయి. కాళ్ల మండలంలో 2281 ఫిష్ ట్యాంక్‌లకు విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఆక్వా విద్యుత్ రాయితీ పొందుతున్న సర్వీసులు 1671 ఉన్నాయి. రూ.1.2 కోట్ల విద్యుత్ రాయితీ రైతులకు వర్తిస్తుంది. ఒక చెరువు నుంచి



ఆక్వా చెరువుకు అక్రమ విద్యుత్ వైరు



రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

మరో చెరువుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. విద్యుత్ శాఖ అధికారులకు కొంతమంది ఫిర్యాదు చేసినప్పటికీ విద్యుత్ చౌర్యం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవడంలేదని, అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన వైర్లను తొలగించేందుకే వెనకడుగు వేస్తున్నారని చెప్పారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తుతో ఈ అక్రమ విద్యుత్ చౌర్యాన్ని ప్రోత్సహిస్తున్నారని బహిరంగంగానే కాళ్ల మండలంలో పలు గ్రామాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆక్వా చెరువులకు అక్రమ విద్యుత్ కనెక్షన్లు

మండలంలో కాళ్ల, సీసలి, బొండాడ, దొడ్డనపూడి, కలవపూడి, ఏలూరుపాడు, జువ్వలపాలెం, మాలవానితిప్ప, ఎల్ఎన్.పురం గ్రామాల్లో యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం జరుగుతోందని పలువురు వాపోతున్నారు. ఇలా ఏళ్ల తరబడి విద్యుత్ చౌర్యం జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అనుమతులు లేని ఆక్వా చెరువులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పి.రాంబాబు, విద్యుత్ శాఖ ఎఇ, కాళ్ల

అనుమతి తీసుకున్న చెరువుకే విద్యుత్‌ను వినియోగించాలి. అక్రమ విద్యుత్ వాడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఫిర్యాదు వస్తే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తాం. రెండోసారి అక్రమ విద్యుత్ వాడితే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

నేడు కేంద్రమంత్రి పర్షోత్తమ్ రూపాలా రాక

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖా మంత్రి పర్షోత్తమ్ రూపాలా మంగళవారం భీమవరం రానున్నట్లు జిల్లా సమాచార శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు మచిలీపట్నం నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి సాయంత్రం 5:30 గంటలకు భీమవరం చేరుకుంటారని తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకూ జిల్లాలోని ఆక్వా రైతులతో, ప్రాసెసింగ్ ప్లాంట్స్ ఆపరేటర్లతో ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించే సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. రాత్రి భీమవరంలో బసచేసి, మూడో తేదీ ఉదయం 8.45 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి కోనసీమ జిల్లా అంతర్వేదిపాలెం వెళతారని తెలిపారు.

2,37,546 మందికి పింఛన్లు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా వ్యాప్తంగా 2,37,546 మంది ఫెన్షనర్లకు రూ.69,73,89 వేలు నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నాటి నుంచే పెంచిన పింఛను మొత్తం రూ.3 వేలను లబ్ధిదారులకు పంపిణీ చేయడం ప్రారంభించినట్లు చెప్పారు. సోమవారం ఒక్కరోజే 13 మండలాల్లోని 1,836 మంది పెన్షనర్లకు రూ.54.50 లక్షల నగదును పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన పెన్షనర్లకు రెండో తేదీ నుంచి ఐదో తేదీ వరకు జిల్లాలోని ఆరు పట్టణ ప్రాంతాల్లో, 20 మండలాల్లో షెడ్యూల్ ప్రకారం నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బళ్ల చినవీరభద్రరావు డిమాండ్ చేశారు. వేల్పూర్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక పార్వతిదేవి ఆలయ ప్రాంగణంలో యర్ర మల్లికార్జునరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కార్మి కులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి బోర్డులో ఉన్న నిధులను తరలించుకుపోయి నవరత్నాల పేరుతో ప్రజలకు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తూ భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని విమ ర్శించారు. భవన నిర్మాణం, ఇతర కట్టడాల వల్ల సంక్షేమ బోర్డులో జమ అయ్యే నిధులను కార్మిక కుటుంబాల సంక్షేమా నికి ఖర్చు పెట్టాలని చట్టంలో నిబంధన ఉన్నప్పటికీ అందు కు విరుద్ధంగా నిధులను తరలించుకుపోయి బోర్డును నిర్వీర్యం చేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా వైసిపి ప్రభుత్వం మార్చి వేసిందని వీరభద్రరావు విమర్శించారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు ఎటువం టి సంక్షేమ పథకాలు అమలు కానందు వల్ల గ్రామంలో ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘంలో సభ్యునిగా ఉన్న కార్మికుని భార్య లేదా కుమార్తెకు డెలివరీ (ప్రసవం) అయిన సందర్భంగా ఒక బేబీ కిట్టు బహుమతిగా కార్మికునికి అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కార్మికుడు ఎలిడింది ఈశ్వర విద్యాసాగర్‌కు బేబి కిట్లును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి వెంకన్న, సోరపల్లి రామకృష్ణ, వాటాల నాగేశ్వరరావు, ఆనందం గంగాధరరావు, దున్నే రుద్ర నాగేశ్వరరావు, మల్లాడి మాధవకృష్ణ, అందే కోటబసవయ్య, పర్వతం నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తోట నుంచి జిల్లేడుతిప్ప, కోమటితిప్ప, నీటితిప్ప గ్రామాలను అనుసంధానం చేస్తూ రూ.9 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారని ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

యుటిఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గణపవరం

యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. అనంతరం తహశీల్దార్ పి.లక్ష్మి, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఎంఇఒలు పి.శేషు, బాలయ్య, ఎంపిపి దండు వెంకటరామరాజు, వైసిపి మండల కన్వీనర్ దండు రాములకు నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు శర్మ, వెంకటేశ్వర్లు, బి.రమేష్, శ్రీనివాస్, త్రినాథ్, రామచంద్రరావు, చిన్న యేసు, ఎఆర్‌కె.రవికుమార్ పాల్గొన్నారు.

3 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల మూడో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు శ్రీత్యాగరాజ మ్యూజిక్ అకాడమీ (త్యాగరాజ భక్త సభ) ఆధ్వర్యంలో 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, త్యాగరాజ స్వామివారి 176వ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, కారుమూరి చినబాబు తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, మద్రాస్ నుంచి సంగీత విద్వాంసులు వస్తున్నారని తెలిపారు.